www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 16 నవంబర్ 2024
5
ఏలూరు



నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అంగన్వాడీ మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్లకు ఇచ్చే వేతనాలు చెల్లించాలని కోరుతూ ఈ నెల 16వ తేదీన ఏలూరు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో అంగన్వాడీ మినీ వర్కర్లందరూ సెంటర్లు మూసివేసి పాల్గొనాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కె.విజయలక్ష్మి, అధ్యక్షురాలు పి.సుజాత, ప్రధాన కార్యదర్శి డి.భారతి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత డిసెంబర్‌లో సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ ధర్నాలు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలోని మినీ అంగన్వాడీ వర్కర్లందరూ వారి వారి సెంటర్లను మూసివేసి ఏలూరులో జరిగే ధర్నాకు హాజరు కావాలని పేర్కొన్నారు.



భూములైనా ఇవ్వండి.. పరిహారమైనా చెల్లించండి..!

వట్లూరు భూ నిర్వాసిత రైతులకు న్యాయం జరిగేనా?
2016లో వెమ్ టెక్నాలజీ పరిశ్రమ పేరుతో 340 ఎకరాలు స్వాధీనం
ఎకరాకు రూ.2.30 లక్షల పరిహారం ఇస్తామని హామీ
ఎనిమిదేళ్లు గడిచినా అతీగతీ లేని పరిస్థితి
మళ్లీ టిడిపి ప్రభుత్వం రావడంతో రైతుల్లో ఆశలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

2014-19 మధ్య టిడిపి ప్రభుత్వ హయాంలో పనులు చేపట్టి.. ఆ తర్వాత వైసిపి ప్రభుత్వం బిల్లుల చెల్లించక నష్టపోయిన వారికి న్యాయం చేస్తున్నట్లు టిడిపి కూటమి ప్రభుత్వం చెబుతోంది. అందులో భాగంగానే అప్పట్లో నిర్మించుకున్న ఇళ్ల నిర్మాణ పెండింగ్ బిల్లుల మంజూరు, నీరు-చెట్టు కింద పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులను ప్రభుత్వం చేపట్టింది. దీంతో గత టిడిపి ప్రభుత్వంలో భూములు కోల్పోయి.. పరిహారం అందక తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని వట్లూరు భూనిర్వాసిత రైతులు కోరుతున్నారు. తమకు తిరిగి భూములైనా ఇవ్వండి.. లేకపోతే పరిహారమైనా చెల్లించండి అంటూ భూములు కోల్పోయిన రైతులు వేడుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు వట్లూరు భూనిర్వాసిత రైతులకు న్యాయం చేస్తారో.. లేదో వేచిచూడాలి.

టిడిపి ప్రభుత్వ హయాంలో 2016లో వట్లూరులో వెమ్ టెక్నాలజీ (విమాన విడిభాగాల తయారీ) పరిశ్రమలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికి పెదపాడు మండలం వట్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 495, 496, 497లోనూ, పెదవేగి మండలంలోని సర్వే నెంబర్ 210-29 పరిధిలో దాదాపు 340 ఎకరాలను వెమ్ టెక్నాలజీ సంస్థకు ఎపిఐఐసి ద్వారా కేటాయించారు. ఈ భూములను దాదాపు 300 మంది సన్న, చిన్నకారు రైతులు దశాబ్దాల తరబడి సాగు చేసుకుంటున్నారు. రికార్డుల ప్రకారం ఇవి చెరువు భూములుగా ఉన్నాయి. వందల కుటుంబాలు ఈ భూమిలే ఆధారంగా జీవనం సాగించేవి. చెరువు భూములనే సాకుతో రైతులకు ఎటువంటి పరిహారమూ ఇవ్వకుండా ఈ భూములను లాగేసుకున్నారు. దీంతో రైతులు పెద్దఎత్తున ఆందోళనలకు దిగారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న వైసిపి నాయకులు సైతం రైతుల ఆందోళనకు మద్దతు తెలిపారు. కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున నిరసనలు సాగాయి. దీంతో ప్రభుత్వం దిగొచ్చింది. ఎకరాకు రూ.2.50 లక్షల పరిహారం చెల్లించేలా నిర్ణయించారు. అప్పటి జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్, దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. అయితే నేటికీ రైతులకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. 2019లో జరిగిన ఎన్నికల్లో టిడిపి ఓటమి పాలై వైసిపి అధికారం చేపట్టింది. దీంతో పరిశ్రమ ఏర్పాటు వెనక్కిపోయింది. దీంతో అగ్రిమెంట్ రద్దు చేసుకుని 2022 ఏప్రిల్‌లో వట్లూరు భూములను వెమ్ టెక్నాలజీ నుంచి ఎపిఐఐసి స్వాధీనం చేసుకుంది. దీంతో రైతులు సాగు చేసుకునేందుకు తమ భూములు ఇవ్వాలని మళ్లీ పోరుబాట పట్టారు. జాతీయ రహదారిపై రాస్తారోకోలు సైతం చేశారు. అయినప్పటికీ వైసిపి ప్రభుత్వం స్పందించలేదు. ప్రస్తుతం భూములన్నీ ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నాయి. రైతులు మాత్రం రోడ్డున పడ్డారు. ఎంతోమంది రైతులు ఆ భూములను తమ ఆడపిల్లలకు పసుపు కుంకుమ కింద ఇచ్చి వివాహాలు చేశారు. అలాంటి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. రైతుల ఇబ్బందులను మాత్రం పాలకులు పట్టించుకోని పరిస్థితి ఉంది.

కూటమి సర్కార్ రాకతో రైతుల్లో చిగురించిన ఆశలు

గడిచిన మే నెలలో జరిగిన ఎన్నికల్లో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో నిర్వాసిత రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. సాగు చేసుకోవడానికి భూములైనా ఇవ్వండి.. పరిహారమైనా చెల్లించండి అంటూ రైతులు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వట్లూరు రైతులకు న్యాయం చేయాలని అంతా కోరుతున్నారు. ప్రకటించిన కొద్దిపాటి పరిహారం సైతం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం ఏమాత్రం తగదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. మొన్నటి వరకూ వైసిపి ఎంఎల్‌ఎగా ఉన్న అబ్బాయిచౌదరి నిర్వాసిత రైతుల గురించి పట్టించుకోని పరిస్థితి. టిడిపి కూటమి ప్రజాప్రతినిధులైనా తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. వట్లూరు రైతులకు న్యాయం జరుగుతుందో, లేదో వేచిచూడాలి.

దేశ ప్రగతిలో సహకార సంఘాలు కీలకం

జిల్లా సహకార అధికారి ఎ.శ్రీనివాస్



ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - ఏలూరు

దేశ ప్రగతిలో సహకార సంఘాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని జిల్లా సహకార అధికారి ఎ.శ్రీనివాస్ అన్నారు. అఖిలభారత సహకార వారోత్సవాల సందర్భంగా జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఆవరణలో శుక్రవారం ఆయన సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సహకార సంఘాలు లాభాపేక్ష లేకుండా ప్రజలకు సేవలందిస్తున్నాయన్నారు. రైతులకు రుణాలు అందించడం, ఎరువులు, విత్తనాల నుండి పండిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం వరకు అన్నీ సేవలందిస్తున్నాయన్నారు. ఏలూరు జిల్లాలో డిసిఎంఎస్ ద్వారా రైతులకు, వినియోగదారులకు నాణ్యమైన వస్తువులను తక్కువ ధరలకే అందిస్తున్నాయన్నారు. సహకార వారోత్సవాల ఇన్‌ఛార్జి ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ సహకార వారోత్స వాల ప్రాముఖ్యత వివరించారు. బిజినెస్ మేనేజర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ తమ మార్కెటింగ్ సంస్థ ద్వారా చేస్తున్న వ్యాపారాల లావాదేవీలు, సంఘ ప్రగతి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ఎం.నరసింహారావు, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్, ఎకెఎస్.మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలుంటే తెలపండి

సిబ్బందికి ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ సూచన



వినతులు స్వీకరిస్తున్న ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

సిబ్బందికి ఎటువంటి సమస్యలున్నాయో నేరుగా తనను కలిసి తెలపవచ్చని, ఆ ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తానని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం పోలీస్ సంక్షేమ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు సిబ్బంది నుంచి జిల్లా ఎస్‌పి ఫిర్యాదులను స్వీకరించారు. ఆ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. సిబ్బంది ఎప్పుడైనా తనను కలిసి ఫిర్యాదులు అందించవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు ప్రభుత్వ భూములు పంచాలి

సిపిఎం టి.నర్సాపురం మండల మహాసభలో జిల్లా కార్యదర్శి ఎ.రవి



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - టి.నర్సాపురం

మండలంలో అసైన్డ్, సీలింగ్, ఇరిగేషన్ భూములను పేదలకు పంచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఎఎస్‌ఆర్ నగర్‌లో మెట్టపై అనుమోలు మురళీ, మడకం సుధారాణి, సరియం దుర్గమ్మ అధ్యక్షతన మండల మహాసభ నిర్వహించారు. ముఖ్యఅతిథి రవి మాట్లాడుతూ మండలంలో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. గత 25 ఏళ్లకుపైగా ఈ ప్రాంతంలో గిరిజనులు, దళితులు, పేదలు భూముల కోసం పోరాడుతున్నారని, అయినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వమైనా పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని కోరారు. ఎర్రకాలువ ఇరిగేషన్ భూముల్లో సాగు చేసుకుంటున్న వారికి ఏక్‌సాల్ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎఎస్‌ఆర్ నగర్ మెట్టపై ఇళ్లు నిర్మించుకుని నివాసమున్న పేదల ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని, వారికి కనీస సౌకర్యాలైన తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రామమ్మగూడెం గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు రక్షణ కల్పించాలని, దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులను ఖండించాలని కోరారు. ఈ పోరాటాల్లో ప్రజలు ఐక్యంగా పోరాడాలని, అందుకు సన్నద్ధం కావాలని కోరారు. మండలంలో దళితులు, గిరిజనుల నిష్పత్తి ప్రకారం అర్హులైన పేదలందరికీ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. దళితుల శ్మశాన భూముల సమస్యలు, కనీస సౌకర్యాల కొరతను పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్ 13, 14, 15 తేదీల్లో బుట్టాయగూడెంలో జరిగే సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యులు గుడెల్లి వెంకట్రావు, పి.రామకృష్ణ మాట్లాడుతూ పేదల సమస్యలను పరిష్కరించాలని, కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, మూడు గ్యాస్ సిలిండర్లు వంటి పథకాల అమలుతోపాటు నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరారు. సభలో నాయకులు మడకం కుమారి, శిరీష, బుద్ధుల దుర్గమ్మ, రాజు, పూసం సూర్యారావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

గోపాలకృష్ణయ్యకు సతీ వియోగం



ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సేవా తత్పరులు, అభ్యుదయవాది, కమ్యూనిస్టు శ్రేయోభిలాషి, జిల్లా ప్రభుత్వాసుపత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య సతీమణి రావి పద్మ శుక్రవారం కన్నుమూశారు. స్థానిక నరసింహారావుపేటలోని స్వగృహంలో శుక్రవారం ఉదయం అనారోగ్య కారణంతో పద్మ మృతి చెందారు. ఆమె తన భర్త గోపాలకృష్ణయ్య తోపాటు చురుగ్గా అనేక సామాజిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారని, ఆమె మృతి తీరని లోటని పలువురు కొనియాడారు. లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు, వైస్ గవర్నర్ డాక్టర్ డి.సుబ్బారావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ జిఎస్.ప్రసాద్, డాక్టర్ వంశీ, డాక్టర్ దొంతంశెట్టి బసవరాజు, రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్.వెంకటేశ్వరరావు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు, నగరంలోని ప్రముఖ వైద్యులు శుక్రవారం ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహా రావు, హేలాపురి బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వం టరావు తమ సంతాపాన్ని తెలిపారు. గోపాల కృష్ణయ్య, పద్మ దంపతుల కుమార్తె అమెరికాలో ఉన్నారు. దీంతో పద్మ భౌతికకాయాన్ని ఆశ్రం ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచారు. ఆమె ఆదివారం ఆమె వస్తారని, సోమవారం అంత్యక్రియలు జరగవచ్చని సమాచారం.

ఉచిత ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

రాష్ట్ర గనుల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్రంలో ఉచిత ఇసుక అక్రమ రవాణాకు పాల్పడేవారిపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర గనుల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా అన్నారు. జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో ఉచిత ఇసుక విధానంపై సమీక్షించారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌కు జిల్లా నుంచి కలెక్టర్ కె.వెట్రిసెల్వి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ నదులకు ఆనుకుని ఉన్న గ్రామాల్లోని ప్రజల అవసరాలకు ఉచితంగా ఇసుక తీసుకువెళ్లడానికి మండలస్థాయి అధికారి అనుమతులు ఇవ్వాలన్నారు. ఇసుక కావాల్సినవారు సంబంధిత గ్రామ సచివాలయంలో ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ పక్కాగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘనకు గురికాకుండా నిఘా పెంచాలన్నారు. ఈ నెల 19వ తేదీన మరుగుదొడ్ల దినోత్సవం నేపథ్యంలో ఆరోజు నుంచి డిసెంబర్ పదో తేదీ వరకు మరుగుదొడ్లు, పరిశుభ్రతపై ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకుని వారిని గ్రామ పంచాయితీ స్థాయిలో గుర్తించి బహుమతులను ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ త్రినాథ్‌బాబు పాల్గొన్నారు.

భూనిర్వాసితులకు ఎకరాకు రూ.40 లక్షలు పరిహారమివ్వాలి

చింతలపూడి మండల మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్



మహాసభలో మాట్లాడుతున్న డిఎన్‌విడి.ప్రసాద్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఎత్తిపోతల, గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసితులకు ఎకరాకు రూ.40 లక్షలు పరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ డిమాండ్ చేశారు. సిపిఎం మండల మహాసభ స్థానిక సిపిఎం కార్యాలయంలో శుక్రవారం పాండురంగారావు, చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సమస్యలు పరిష్కరించకపోగా ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించడంలో పోటీ పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూనే ట్రూఅప్ ఛార్జీల పేరిట భారం మోపారని విమర్శించారు. చిన్నారులు, మహిళలపై అఘాయిత్యాలు పెరిగినా చోద్యం చూస్తున్నారన్నారు. చింతలపూడిలో బస్సు డిపో ఏర్పాటు చేయాలని, విజయవాడకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. నిత్యావసరాల ధరలు నియంత్రణ ఊసే లేదన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల గురించి పట్టించుకోవడం లేదని, సరైన మద్దతు ధర లేక రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారని అన్నారు. చింతలపూడి పట్టణ పరిధిలో ఉపాధి కూలీలకు ఉపాధి పనులు చూపాలని డిమాండ్ చేశారు. పామాయిల్ గెలలు కోసే కార్మికులకు బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేలో ఉపాధి కోల్పోయిన రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఉపాధి కల్పించాలని కోరారు. ఈ మహాసభలో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. మండల కన్వీనర్ ఆర్‌విఎస్ నారాయణ కార్యకలాపాల రిపోర్టును ప్రవేశ పెట్టగా ప్రతినిధులు చర్చించి ఆమోదించారు. ఈ సభలో నాయకులు డి.సత్యనారాయణ, సులోమాను, జోషి, వరలక్ష్మి, అనురాధ పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు విడనాడాలని, ప్రజలపై భారాలను ఉపసంహరించాలని కోరుతూ ప్రజాపోరులో భాగంగా సిపిఎం ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

7,080 క్యూసెక్కుల నీరు విడుదల

పోలవరం : పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 7,080 క్యూసెక్కుల నీటిని పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పెద్దిరాజు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 20 మోటార్లు 20 పంపుల ద్వారా 7,080 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. గోదావరి నీటిమట్టం 14.22 మీటర్లకు పైబడి ఉందని, కృష్ణా డెల్టా, ఉమ్మడి పశ్చిమ డెల్టాలకు సాగునీటి అవసరాలకు నీటి అవసరం దృష్ట్యా నీరు విడుదల చేస్తున్నామని, అవసరాన్ని బట్టి పంపుల సంఖ్య ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విడుదల చేస్తామని తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని ధర్నా



నిడమర్రు : డిటికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - నిడమర్రు

ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిడమర్రు తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం అనంతరం నిడమర్రు డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నారపల్లి రమణారావు, గవర సత్యనారాయణ, కోనా శ్రీనివాసరావు, వెలగలేటి మోహన, కానూరు రాజు, సంకెళ్ల మోహన్‌రావు, పిల్లా సూరిబాబు, పి.దేవి, ఎన్.పద్మావతి పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో రూ.32 వేల కోట్ల విద్యుత్ భారం మోపగా ఐదు నెలల్లో టిడిపి కూటమి ప్రభుత్వం రూ.17,898 కోట్ల విద్యుత్ సర్దుబాటు ఛార్జీల భారం జనం నెత్తిన వేస్తుందని సిపిఎం మండల కన్వీనర్ శుక్లబోయిన రాంబాబు అన్నారు. ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా పరిపూడి ఎస్‌సి పేటలో ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలను పెంచబోమని, తగ్గిస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు మాట ఇచ్చారన్నారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని ప్రతిపక్షంలో ఉండి ఈ నేతలు పిలుపునిచ్చారు. నేడు మాట తప్పి నమ్మక ద్రోహం చేశారన్నారు. సమస్యల పరిష్కారం కోసం నవంబర్ 16వ తేదీన తహశీల్దార్ కార్యాలయానికి ప్రజలందరూ వచ్చి వినతిపత్రాలు ఇవ్వాలని కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సీజన్ మారుతున్నప్పుడు సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అనారోగ్య సమస్య సంభవిస్తే వైద్య సిబ్బందిని సంప్రదించాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక లంబాడిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఫిల్ హౌస్ పేట ప్రాంతంలో శుక్రవారం ప్రజలకు డ్రైడే కార్యక్రమంపై, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గోవిందరావు మాట్లాడుతూ వర్షాకాలం ముగిసి శీతాకాలం ప్రారంభమవుతున్న సమయంలో కొన్ని సీజనల్ వ్యాధులు సంభవించే అవకాశం ఉందని ముఖ్యంగా చలి, వాతావరణం వల్ల దగ్గు, జలుబు, ఆయాసం, ఎలర్జీ కండిషన్స్, వైరల్ ఫీవర్స్ ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, శీతాకాలంలో వేడి వేడి ఆహార పదార్థాలు భుజించాలని, గోరువెచ్చని నీరు తాగాలని, చలి తగలకుండా ఉన్ని దుస్తులు వాడాలని సూచించారు. దోమల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రి సేవలు వినియోగించుకోవాలని చెప్పారు. అక్కడ మనకు అవసరమైన రక్త, మూత్ర పరీక్షలు ఉచితంగా చేస్తారని, మందులు ఉచితంగా అందిస్తారని తెలిపారు. మనకు ఎక్కువగా హాని చేసే డెంగీ, మలేరియా కారక దోమలు మన గృహాల్లో ఉండే మంచి నీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయని, నీళ్ల తొట్లు వారానికి ఒకసారి శుభ్రపరచుకుని మూతలు పెట్టుకోవాలని సూచించారు.

మాఫియా కబంధహస్తాల్లో కొల్లేరు

సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ



ఏలూరు అర్బన్ : మాట్లాడుతున్న నారాయణ

ప్రజాశక్తి - మండవల్లి

కొల్లేరు మాఫియా కబంధహస్తాల్లో చిక్కుకుపోయి కొట్టుమిట్టాడుతుందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. కొల్లేరులో ఆయన బోటులో ప్రయాణించి పెరిగిన కాలుష్యాన్ని, బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు ప్రవాహాలు కలిసే ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించారు. లంకల ప్రజలతో మమేకమై వారు పడుతున్న ఇబ్బందులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లేరు ముంపు పాపం ప్రభుత్వాలదేనని విమర్శించారు. కొల్లేరులో నిబంధనలకు విరుద్ధంగా వందల ఎకరాల్లో చేపల చెరువు తవ్వేసి సహజ సిద్ధమైన కొల్లేరును నాశనం చేసేశారని స్పష్టం చేశారు. కొల్లేరులో ఆక్రమణలు పెరిగిపోయి కొల్లేరు పూడికపోయి నీటి పారుదలకు అవకాశం లేక వరదల సమయంలో లంక గ్రామాలను ముంచెత్తడంతో ప్రజల జీవన విధానం చిన్నాభిన్నం అయిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లేరు మాఫియాను అడ్డుకోకుండా రాజకీయ ప్రత్యర్థులపై మాత్రమే వారి ప్రతాపాన్ని చూపిస్తూ కొల్లేరు ప్రజల జీవితాలను నాశనం చేస్తున్నారన్నారు. వలసలను నిరోధించే విధంగా 200 రోజులు పని దినాలను కల్పించాలని, కొల్లేరుకు శాశ్వత పరిష్కారం చూపించాలని ఆయన డిమాండ్ చేశారు. కొల్లేరు సమస్యను పరిష్కరించకుంటే ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి దీక్ష చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య ఏలూరు జిల్లా అధ్యక్షులు వరకాశ్యామల, సిపిఐ ఏలూరు కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ జిల్లా కార్యవర్గ సభ్యులు ముప్పాల కన్నబాబు, ఎఐటియుసి ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, గ్రామ సర్పంచి ముంగర నాగరాజు, ముంగర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కొల్లేరును ప్రక్షాళన చేయాలి

ఏలూరు అర్బన్ : కొల్లేరును ప్రక్షాళన చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో కొల్లేరు పరిరక్షణ సదస్సు సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులను వేదిక పైకి సిపిఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ ఆహ్వానించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా హాజరైన కె.నారాయణ మాట్లాడుతూ కొల్లేరు అంశం రాష్ట్ర పరిధిలోనే కాకుండా కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉందన్నారు. కొల్లేరు పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి పరిష్కరించని పక్షంలో ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి దీక్షలు చేస్తామని హెచ్చరించారు. తెలుగు ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టును 45.72 ఎత్తులోనే నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ కొల్లేరులో భూ మాఫియా ఆక్రమణల కారణంగా వేలాది ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయని విమర్శించారు. సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య మాట్లాడుతూ లంక గ్రామాల సమస్యలను పరిష్కరించడానికి ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. డిసెంబర్ 26వ తేదీ నుంచి సిపిఐ శత జయంతి ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు వందన సమర్పణ చేశారు. ఈ సదస్సులో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్‌పిసిఐ అనుసంధానానికి ప్రత్యేక క్యాంపులు

ప్రజాశక్తి - ఏలూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, తపాలా శాఖ సంయుక్తంగా వివిధ ప్రభుత్వ పథకాల సొమ్మును లబ్ధిదారులకు నేరుగా డిబిటి ద్వారా వారి ఖాతాల్లో జమ చేసేందుకు ఎన్ పిసిఐ (నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) అనుసంధానం, కొత్త అక్కౌంట్స్ ఓపెనింగ్ సులభతరం చేయటానికి ఏలూరు డివిజన్ పరిధిలోని 248 పోస్టాఫీసుల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఏలూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీకర్‌బాబు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం ఏలూరు పట్టణ పరిధిలో ఉన్న ఇశ్రాయేల్‌పేటలోని శివగోపాలపురం సచివాలయంలో, ఎర్రంపల్లి గ్రామం (ప్రగడవరం)లో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంపుల్లో దాదాపు 200 మందికి పైగా లబ్ధిదారులు వారి ఖాతాలకు ఎన్ పిసిఐ అనుసంధానం చేసుకున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఎఫ్‌ఎస్) జి.శివనాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు రావాలంటే ఖాతాకు ఎన్ పిసిఐలో ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా ఉండాలని, రాష్ట్రంలో దాదాపు 64.81 లక్షల ఖాతాలకు ఎన్ పిసిఐ లింక్ లేకుండా ఉన్నాయని తెలిపారు. ఈ ప్రత్యేక క్యాంపులు ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతాయని, ప్రజలందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని, మరింత సమాచారం కోసం దగ్గరలోని పోస్టాఫీసునకు వెళ్లాలని తెలిపారు.

వై కూడలిలో వెలిగిన వీధి దీపాలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎట్టకేలకు ముదినేపల్లి గ్రామపంచాయతీ స్పందించింది. ముదినేపల్లి వై కూడలిలో వెలగని వీధి దీపాలు శీర్షికతో ఈ నెల 11వ తేదీన ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ స్పందించారు. వై కూడలిలో పాడైన వీధి దీపాలను తొలగించి వాటి స్థానంలో కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేశారు. దీంతో వాహనదారులు, వ్యాపారులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అందరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం తెలిపారు. నగరంలోని జిల్లా ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉప రవాణా కమిషనర్ కరీం మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ప్రజా రవాణా విభాగంలో పనిచేస్తుండడం వల్ల వారు రోడ్డు ప్రమాదానికి గురైతే వారితో పాటుగా ప్రయాణికులు కూడా రోడ్డు ప్రమాదానికి గురవుతారన్నారు. ఆటోల బీమా, ఫిట్‌నెస్ పత్రాలను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలన్నారు. లైసెన్సులు లేకుండా ఆటోలు నడిపితే రూ.ఐదు వేల వరకు జరిమానా విధించనున్నట్లు తెలిపారు.

జనసేనలోకి వైసిపి కార్పొరేటర్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నియోజకవర్గంలో రోజురోజుకూ చేరికలు జరుగుతూనే ఉన్నాయి. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం వైసిపికి చెందిన 44వ డివిజన్ కార్పొరేటర్ పొలిమేర దాసు, మాజీ కౌన్సిలర్లు అద్దెపల్లి నారాయణరావు, అద్దెపల్లి కృష్ణకుమారి, జయదీప్‌లతో పాటు వంద మందికి పైగా వారి అనుచరులు, రిటైర్డ్ ఎంప్లాయీస్‌లు పలువురు జనసేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు (చినబాబు), రాష్ట్ర కార్యదర్శి, దెందులూరు సమన్వయకర్త ఘంటసాల వెంకటలక్ష్మి హాజరై రెడ్డి అప్పల నాయుడు సమక్షంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి వారిని ఆహ్వానించారు. తొలుత భారీగా తీన్‌మార్ డప్పులతో బాణసంచాలు కాలుస్తూ పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు (చినబాబు) మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల కన్వీనర్ రాఘవయ్య చౌదరి, మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి ప్రసాద్, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

14న మెగా లోక్ అదాలత్

ప్రజాశక్తి - చింతలపూడి

స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో డిసెంబర్ 14వ తేదీన జరిగే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు కోరారు. శుక్రవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులతో లోక్ అదాలత్‌పై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ నువినియోగించుకోవాలని సూచించారు. మెగా లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్, నూజివీడు డిఎస్‌పి కెవివిఎన్‌వి.ప్రసాద్ ఆదేశాల మేరకు శుక్రవారం నూజివీడు టౌన్ ఎస్ఐ సత్య శ్రీనివాస్, సిబ్బంది, అభయ మహిళా రక్షక సిబ్బందితో నూజివీడులోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. పోలీస్ కేసులు ఉంటే విద్యార్థుల బంగారు భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలను కోల్పోతారన్నారు. విదేశాల్లో విద్యాభ్యాసం చేయడానికి పాస్‌పోర్ట్ కూడా రాదన్నారు. విద్యార్థులు 20 ఏళ్ల పాటు తలదించుకుని చదువుకుంటే మిగిలిన శేష జీవితమంతా కూడా సమాజంలో తలెత్తుకుని తిరగ గలుగుతారన్నారు. విద్యార్థులు విద్యపై దృష్టి పెట్టాలన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేసుకోవడం వల్ల వచ్చే సమస్యల గురించి నూజివీడు టౌన్ సిఐ వివరించారు. జిల్లాలో బాలికల, మహిళల సంరక్షణ కోసం ప్రత్యేకంగా అభయ మహిళా రక్షక దళాన్ని ఏర్పాటు చేశారని, వారు నిత్యం స్కూల్ వద్ద, బస్టాండ్ వద్ద, కళాశాల వద్ద ఈవ్‌టీజింగ్‌కు పాల్పడకుండా రక్షణగా ఉంటారని చెప్పారు. బాలికల భద్రతకు సంబంధించి గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడా గురించి వివరించారు. విద్యార్థులు ఇంటర్నెట్‌ను అవసరం మేరకే వాడాలన్నారు. అపరిచిత వ్యక్తులు పంపించేటువంటి లింకులను, మెసేజ్‌లను ఓపెన్ చేయకూడదని తెలిపారు.

7 నుంచి షష్ఠి వేడుకలు

ప్రజాశక్తి - ఉంగుటూరు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ధర్మరాజు

కైకరంలో వచ్చేనెల ఏడో తేదీ నుంచి 13వ తేదీ వరకు జరగబోయే 90వ శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి షష్టి మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను శుక్రవారం విజయవాడలో ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు ఆవిష్కరించారు. రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు చింతల శ్రీనివాస్, కైకరం గ్రామ సర్పంచి సలగాల గోపీ, కూటమి నాయకులు, కార్యకర్తలు, షష్టి ఉత్సవ కమిటీ వారు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ట్రాక్టర్ ట్రక్కు బోల్తా

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చిన్నంపేటలో శుక్రవారం వరిగడ్డి లోడుతో ఉన్న ట్రాక్టర్ ట్రక్కు బోల్తా పడింది. చిన్నంపేట గ్రామం నుంచి కోటపాడు గ్రామానికి వరిగడ్డి లోడుతో వెళ్తుండగా గోతిలో పడి ట్రాక్టర్ ట్రక్కు బోల్తా పడింది. పెద్ద పెద్ద గోతులతో రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు చెబుతున్నారు. రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

44 తెలంగాణ మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిపిన దాడుల్లో ముగ్గురి వద్ద 44 తెలంగాణ మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేశామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్ఐ మస్తానయ్య తెలిపారు. ఈ దాడుల్లో ప్రొహిబిషన్, ఎక్సైజ్ నూజివీడు ఎస్ఐ ఈశ్వరరావు, ఎం.ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్స్ కె.వెంకటేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.వీరయ్య, సిబ్బంది పాల్గొన్నారు. గత నెల రోజుల్లో స్టేషన్ పరిధిలో జరిపిన దాడుల్లో 29 కేసులు నమోదు చేసి 22 మందిని అరెస్టు చేసి 382 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని రెండు మోటార్ వెహికల్స్‌ను కూడా స్వాధీనం చేసుకున్నామని, 21 మందిని బైండోవర్ చేశామని తెలిపారు. ఈ బైండోవర్ అయిన వారు మళ్లీ నేరాలకు పాల్పడితే రూ.లక్ష జరిమానా, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని హెచ్చరించారు. నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, చాట్రాయి మండల్లాలోని 16 మద్యం దుకాణదారులు ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి మనిషికి మూడు మద్యం సీసాలకు మించి ఇవ్వకూడదన్నారర. 21 ఏళ్ల లోపు వారికి మద్యం విక్రయించకూడదని, ప్రభుత్వం నిర్ణయించిన ధరకే మద్యం విక్రయించాలని సూచించారు. మద్యం దుకాణదారులు బెల్ట్‌షాపులకు మద్యాన్ని సరఫరా చేస్తే సహించేది లేదని, బెల్ట్ షాపులకు అనుమతులు లేవని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాటిని నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని కామయ్యపాలెం గ్రామ శివారులో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న నాటు సారా తయారీ స్థావరంపై శుక్రవారం జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ అధికారి కె.శ్రీనుబాబు ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈ దాడుల్లో నాటు సారా తయారీకి సిద్ధంగా ఉన్న 700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. నాటు సారా తయారు చేసే వ్యక్తి ఎవరనేదానిపై విచారణ చేస్తున్నట్లు సిఐ శ్రీనుబాబు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయమైన పరిహారం చెల్లించకపోతే ఉద్యమం

చింతలపూడి ఎత్తిపోతల భూ నిర్వాసిత రైతులు

ప్రజాశక్తి - చింతలపూడి



అభివాదం చేస్తున్న భూ నిర్వాసిత రైతులు, రైతు సంఘం నాయకులు

చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతులకు పరిహారం చెల్లింపునకు 2015, 2016లో ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేసి కొత్త నోటిఫికేషన్ ద్వారా పరిహారం చెల్లించాలని భూ నిర్వాసిత రైతుల సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. చింతలపూడిలో గురుభట్లగూడెం రోడ్డులో చిట్లూరి అంజిబాబు ఇంటి వద్ద ఆయన అధ్యక్షతన చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 2015, 2016లలో భూసేకరణ నోటిఫికేషన్ ద్వారా తక్కువ పరిహారం రావడంతో అప్పటి నుంచి చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతులు న్యాయమైన పరిహారం కోసం పోరాటం చేస్తున్నారన్నారు. మార్కెట్ విలువ కంటే అతి తక్కువ పరిహారం ఇవ్వడంతో నిర్వాసిత రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కాలంలో భూముల విలువ మరింత పెరిగిందని చెప్పారు. ప్రభుత్వం నిధులు కేటాయించడంతో 2016లో ఇవ్వాల్సిన పరిహారం ఇప్పుడు చెల్లిస్తున్నామని, అందుకు రైతులు అంగీకరిస్తున్నట్లు అధికారులు రైతులను అంగీకార పత్రాలపై సంతకాలు కోరడం అన్యాయమన్నారు. జిల్లా కలెక్టర్ సమక్షంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతుల సమస్యలపై చర్చలు జరిపి రైతుల అంగీకారంతో న్యాయమైన పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. ప్రస్తుత ప్రయివేట్ మార్కెట్ విలువకు అనుగుణంగా భూములకు పరిహారం చెల్లించాలన్నారు. 2015, 2016 భూ సేకరణ నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త నోటిఫికేషన్ ద్వారా మాత్రమే పరిహారం చెల్లించాలన్నారు. ఈ నెల 18న జిల్లా కలెక్టరేట్‌కు సామూహిక రాయబారం కార్యక్రమం నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామని చెప్పారు. భూ నిర్వాసిత రైతులు సాదరబోయిన వరలక్ష్మి, తెగడ వెంకన్న, సొంగా సత్యనారాయణ, కుప్పాల చిన్నయ్య, వేల్పుల వెంకటేష్, మాలెంపాటి శ్రీనివాసరావు, కుప్పాల వెంకటరమణ, వనమాల రాంబాబు మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్ట ప్రకారం పాత నోటిఫికేషన్ చెల్లదని చెప్పారు. ఎత్తిపోతల పథకం కాలువ డిజైన్ గురించి కూడా రైతులకు చెప్పకుండా భూ సేకరణ చేశారన్నారు. చెట్లు, షెడ్లు, బోర్లు పరిహారం కూడా చాలా తక్కువగా నిర్ణయించారని వివరించారు. ఇప్పటికైనా రైతులతో చర్చలు జరిపి కొత్త నోటిఫికేషన్ ద్వారా న్యాయమైన పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేసి చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు కూడా వెంటనే పూర్తి చేసి మెట్ట ప్రాంత భూములకు సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు.. లేకపోతే న్యాయం కోసం పోరాడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వనమాల కృష్ణారావు, చిట్లూరి వెంకటరమణ, చిట్లూరి హనుమంతరావు, కొనకళ్ల నాగేశ్వరరావు, గారపాటి లక్ష్మణరావు పాల్గొన్నారు.

'టిడిపి సభ్యత్వ నమోదుతో లబ్ధి'

ప్రజాశక్తి - ముసునూరు

టిడిపి సభ్యత్వ నమోదు చేయించుకున్న వ్యక్తి బీమా కలిగి ఉంటాడని వేల్పుచర్ల టిడిపి గ్రామ నాయకులు గరికిముక్కు నాని అన్నారు. మండలంలోని వేల్పుచర్ల గ్రామంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు వల్ల ప్రమాద బీమా లబ్ధి చేకూరుతుందని తెలిపారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి - ముసునూరు

బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల చిన్న వయసులోనే పలు అనర్ధాలు వస్తాయని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కొండాబత్తుల ప్రవీణ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి అన్నారు. మండలంలోని ముసునూరు గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు బాల్య వివాహాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ లక్ష్మి మాట్లాడుతూ చిన్న వయసులోనే వివాహం చేసుకోవడం వల్ల వయస్సుతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, శారీరక, మానసిక ఒత్తిడి కూడా పెరుగుతుందని, బాల్య వివాహాల వల్ల పలు ఇబ్బందులు ఎదురవుతాయని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలల జీవించే హక్కును కాపాడండి

ప్రజాశక్తి - ఏలూరు



బాలల దినోత్సవం కార్యక్రమంలో వక్తలు, విద్యార్థులు

బాల వికాస్ భారతి ఆధ్వర్యంలో ఏలూరు నగరంలో 29వ డివిజన్, టైటస్ నగర్, అర్బన్ హెల్త్ సెంటర్ కమ్యూనిటీ హాలులో బాలల దినోత్సవం సందర్భంగా యుద్ధాలు వద్దు-బాలల భవితను కాపాడండి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బాల వికాస్ భారతి ప్రెసిడెంట్ న్యాయవాది శ్రీకట్టా సత్యనారాయణ మాట్లాడుతూ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, మానవ హక్కుల మునుగుడకు చేసిన పోరాటానికి ప్రత్యేక చరిత్ర ఉందన్నారు. ఇజ్రాయిల్, పాలస్తీనా, రష్యా, ఉక్రెయిన్‌పై సాగిస్తున్న మారణహోమంలో అభం శుభం తెలియని పిల్లలు, మహిళలు, వృద్ధులు, అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. యుద్ధాలు ఆపాలని మారణ హోమం జరక్కుండా చూడాలని, బాలల బాల్యానికి భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రపంచ దేశాలపై ఉందని తెలిపారు. రిటైర్డ్ హెడ్‌మాస్టర శొంఠ్యాల కస్తూరిరావు మాట్లాడుతూ బాల బాలికలు ప్రత్యేకమైన శ్రద్ధతో విద్యాబుద్ధులు నేర్చుకోవాలన్నారు. మానవత సంస్థ నాయకులు పి.రత్నాకరరావు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కళలు బాలల మనోవికాసానికి దోహదం చేస్తాయన్నారు. మానవత సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు, పోడూరి కనకదుర్గ, కార్యదర్శి సుధ, సభ్యులు పద్మ, మన్మోహని, శ్రీమేతర అజయ్‌బాబు, కూచిపూడి సత్యనారాయణ, కార్యదర్శి, మాతృదేవోభవ, ప్రముఖ గాయకుడు సోమ్లా నాయక్ బాలబాలికలకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా యుద్ధాలు వద్దు... బాలల భవితను కాపాడండి అంటూ బాల బాలికల చేత ప్లే కార్డ్స్ పట్టుకుని తంగెళ్లమూడి పంచాయతీ ఆఫీస్ వద్ద నుండి పురవీధుల్లో బాలల హక్కులు కాపాడాలని నినాదాలిస్తూ ర్యాలీ నిర్వహించారు. శ్రీ ఆలపాటి నాగేశ్వరరావు మానవతా సంస్థ విద్యానిధి ఛైర్మన్ సహకారంతో బాల బాలికలకు పౌష్టికాహారం అందించారు. టైటాస్ నగర్ పెద్దలు, బాలబాలికలు, తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆశ్రం ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

ఏలూరు సిటీ :అడ్వాన్సుడ్ లాప్రోస్కోపిక్ సర్జరీ ద్వారా అరుదైన శస్త్రచికిత్స నిర్వహించినట్లు ఆశ్రం హాస్పిటల్స్ సిఇఒ డాక్టర్ కె.హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రకాష్‌రావుపాలెం గ్రామానికి చెందిన 52 ఏళ్ల మహిళకు ప్యాంక్రియాస్ గ్రంధిలో కంతి ఉన్నట్లు గుర్తించిన స్థానిక వైద్యులు ఆశ్రమ హాస్పిటల్‌కి అత్యుత్తమ చికిత్స నిమిత్తం సూచించారని తెలిపారు. ఆశ్రం హాస్పిటల్స్‌లో సర్జికల్ గ్యాస్ట్రో విభాగానికి చెందిన డాక్టర్ టివి.కృష్ణవర్ధన్‌ని సంప్రదించగా పేషెంట్‌కు అవసరమైన పరీక్షలు చేసి క్లోమ గ్రంధిలో కంతి ఉన్నట్టు ఉన్నట్లు గుర్తించారు. ఓపెన్ విధానంలో ఆపరేషన్ చేస్తే విపరీతమైన నొప్పితో పాటు కోలుకోవడానికి సమయం పడుతుందని పేషంట్ బంధువులకు డాక్టర్లు తెలిపారు. లాప్రోస్కోపీ ద్వారా చికిత్స చేస్తే ఎటువంటి ఇబ్బంది ఉండదని, డాక్టర్లు తెలపడంతో పేషంట్ బంధువులు అంగీకారం మేరకు లాప్రోస్కోపిక్ విధానం ద్వారా స్ప్లీన్ ప్రెజర్వింగ్ డిజిటల్ ప్యాంకు సర్జరీ చేసినట్లు తెలిపారు. ఇటువంటి అడ్వాన్స్‌డ్ లాప్రోస్కోపిక్ సర్జరీ ఏలూరు జిల్లాలోనే ప్రప్రథమంగా చేసినట్లు తెలిపారు.

అనాథ పిల్లలకు అండగా శ్లోక కాన్సెప్ట్ స్కూల్

ప్రజాశక్తి - కుక్కునూరు

శ్లోక కాన్సెప్ట్ స్కూల్‌లోని విద్యార్థులు గొప్ప మనసును చాటుకున్నారు. చిన్న వయసులోనే సేవాభావాన్ని పెంపొందించాలని పాఠశాల యాజమాన్యం ఇచ్చిన పిలుపు ను నిలబెట్టుకుంటూ తమ దాతృత్వాన్ని చాటి చెప్పారు. కుక్కు నూరు మండల కేంద్రంలో స్థాపించిన శ్లోక కాన్సెప్ట్ స్కూల్‌లో కరస్పాండెంట్లు మాదినేని శ్రీనివాస్, పిచ్చుక మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం మూడు రోజుల పాటు ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం చారిటీ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యా ర్థుల నుంచి సేకరించిన మూడు క్వింటాళ్ల బియ్యం, 50 కేజీల కందిపప్పు, 20 దుప్పట్లు, 20 ప్లేట్లు, నోట్ పుస్తకాలు, దాదా పు వంద జతల బట్టలను అమ్మ ప్రేమ స్వచ్ఛంద సంస్థ లోని అనాథ పిల్లలకు అందించారు. ఈ కార్యక్రమంలో తహశీ ల్దార్ రమేష్, ఎంపిడిఒ నరసింహరావు, టిడిపి మండలా ధ్యక్షుడు ముళిశెట్టి నాగు, కుక్కునూరు ఉప సర్పంచి పిచ్చుక రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం వారి చేతుల మీదుగా కరస్పాండెంట్లు అమ్మ ప్రేమ స్వచ్ఛంద సంస్థ సిబ్బం దికి నిత్యావసర సరుకులు అందించారు. అమ్మ ప్రేమ స్వచ్ఛం ద సంస్థ ప్రతినిధి శ్రీనివాస్ మాట్లాడుతూ శ్లోక స్కూల్ చేసిన సహాయం ఎప్పటికీ మరిచిపోలేమని చెప్పారు. ఈ చారిటీ డే కార్యక్రమంలో శ్లోక స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

15న మాలల మహాగర్జన సభ

చింతలపూడి :వచ్చే నెల 15వ తేదీన అమరావతిలో జరిగే మాలల మహాగర్జన సభను విజయవంతం చేయాలని అఖిలభారత మాల సంఘాల జెఎసి ఛైర్మన్ డాక్టర్ ఉప్పులేటి దేవిప్రసాద్ కోరారు. పట్టణంలోని వికెఎం ఫంక్షన్ హాలులో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాలో 7.50 లక్షల మంది మాలలు ఉంటే రిజర్వేషన్ ఉన్న స్థానాల్లో ఒక్క సీటు కూడా మాలలకు ఇవ్వకపోవడం మాలల పట్ల చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ

నూజివీడు టౌన్ : మండలంలోని బోర్వంచ గ్రామంలో మండల ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మామిడి తోటల్లో పాటించాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మామిడి పంటలో పూత రావటానికి, సస్యరక్షణ చర్యలపై రైతు సేవ కేంద్ర సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మామిడి పరిశోధన స్థానం- నూజివీడు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బి.కనకమహాలక్ష్మి పలు సూచనలు చేశారు.

గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శనలు

ప్రజాశక్తి - ఏలూరు

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన పుస్తక ప్రదర్శనను ప్రముఖ సామాజికవేత్త కెబి.రావు ప్రారంభించారు. తరగతి గదిలో చదివే చదువు జ్ఞానాన్ని మాత్రమే ఇస్తుందని, గ్రంథాలయంలో చదివే పుస్తకాలతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని చెప్పారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

ఏలూరు సిటీ : ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుస్తక ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్‌పిడిబిటి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్‌విఎస్ఎన్.మూర్తి హాజరయ్యారు. విద్యార్థులకు ఒకటి నుంచి 20 వరకు భగవద్గీత శ్లోకాలపై పోటీలు నిర్వహించారు. ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సర్ సిఆర్ఆర్ కళాశాల, ఇతర కళాశాలల విద్యార్థులకు మాదకద్రవ్యాలపై సమాజంలో జరుగుతున్న దుష్పాలుతాలు వాటి పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అడిషనల్ ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు హాజరయ్యారు.

ముదినేపల్లి :విద్యార్థులు గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవడం అలవాటు చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తహశీల్దార్ జెఎస్.సుభాని అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుస్తక పదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తహశీల్దార్ సుభాని, ఎస్ఐ విఎస్.వీరభద్రరావు పాల్గొని పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. అనంతరం 6, 7 తరగతుల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు, 8,9 విద్యార్థులకు విద్య, మన భవిష్యత్ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

నూజివీడు టౌన్ :గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నూజివీడు ప్రథమశ్రేణి గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ప్రముఖ వైద్యులు వి.రాఘవరావు ప్రారంభించారు. రామ్మోహన్‌రావు అధ్యక్షతన పుస్తక పఠనం విద్యార్థులకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

కలిదిండి : స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను తహశీల్దార్ ఎల్‌విఎస్.రామకృష్ణ ప్రారంభించారు. విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించారు.

టి.నరసాపురం : స్థానిక శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను శుక్రవారం ఎంఇఒ ఎస్.కళ్యాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విజన్ యుపి స్కూల్ కరస్పాండెంట్ పురం శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు ఎం.సులోచన, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతలపూడి :చిన్నపిల్లలు, విద్యార్థులందరూ గ్రంథాలయంలో చదవడం అలవాటు చేసుకోవాలని చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు అన్నారు. నగర పంచాయతీలో 57వ జాతీయ గ్రంథాలయాల వార్షికోత్సవంలో భాగంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన పుస్తకాలను ఆవిష్కరించారు.

పెదపాడు : పెదపాడు శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ పుస్తక ప్రదర్శనను పెదపాడు విద్యుత్ కార్యాలయ ఎఇ రాంబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ గురుకులం స్కూల్ ఉపాధ్యాయుడు శెటికం వెంకటేశ్వరరావు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

మండవల్లి : పుస్తక ప్రదర్శనలో మండవల్లి ఎస్ఐ రామచంద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ మేనేజర్ కె.జ్యోతిప్రసాద్, ప్రజాస్వామ్య ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్.భాస్కరరావు, షేక్ పరివిన, కార్యదర్శి కొండలు, తేలు శ్యామల, అబితా బేగం, టి.ప్రభ, ఎం.లక్ష్మి, ఝాన్సీ, లక్ష్మి, నళిని పాల్గొన్నారు.